జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

సర్ చేయాల్సిందే..!

-సర్‌లో అవకతవకలపై కలెక్టర్ కార్యాలయం గేటు వద్ద జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన

- ఓటర్ల జాబితా సవరణలో అవకతవకలపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్

నరసన్నపేట, సెప్టెంబరు 30 (వార్త): ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో అవకతవకలు చోటుచేసుకున్నాయంటూ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయం గేటు వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సనపల అన్నాజీరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిల్లి కృపారాణి మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల జాబితా అత్యంత కీలకమైనదని, అర్హత కలిగిన ప్రతి పౌరుడికి ఓటు హక్కును పరిరక్షించడం ఎన్నికల వ్యవస్థ బాధ్యత అని అన్నారు. సర్ ప్రక్రియ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను ఆమె ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయని, మరికొందరికి నోటీసులు జారీ చేశారని ఆమె ఆరోపించారు. ఈ గణాంకాలు కాంగ్రెస్ చేసిన ఆరోపణలేనని తాజా నివేదికలు కూడా పేర్కొంటున్నాయి. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాత విధానం పాటించాలని ఆమె కోరారు. అర్హత ఉన్న ఓటర్ల పేర్లు తొలగించబడి ఉంటే వారికి తగిన అవకాశం కల్పించి, నిబంధనల ప్రకారం వారి పేర్లను తిరిగి చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ ప్రక్రియపై వచ్చిన ఆరోపణలపై సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. ఎన్నికల సంఘం పనితీరుపై కూడా ఆమె పలు ప్రశ్నలు లేవనెత్తారు. ఈ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం అంతర్గతంగా కూడా అభ్యంతరాలు వ్యక్తమైనట్లు వచ్చిన నివేదికలను ప్రస్తావిస్తూ, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం నిలిచేలా అన్ని వివరాలను పారదర్శకంగా వెల్లడించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశంపై ఎన్నికల సంఘం మాత్రం తన నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకున్నామని, ఈ ప్రక్రియ నిబంధనల ప్రకారమే జరుగుతోందని స్పష్టం చేసింది. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సనపల అన్నాజీరావు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రక్రియపై కాంగ్రెస్ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని తెలిపారు. అర్హులైన ఓటర్ల పేర్లను జాబితాలో కొనసాగించడంతో పాటు తొలగించిన పేర్లను నిబంధనల ప్రకారం పునరుద్ధరించాలని కోరారు.

అలాగే కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణలో చోటుచేసుకున్నట్లు తాము ఆరోపిస్తున్న అవకతవకలపై పారదర్శకమైన దర్యాప్తు జరిపించాలని కోరారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నిరసనలు, ఎన్నికల సంఘంపై ఆరోపణలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ అంశం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమం లో నరసన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ మామిడి సత్యం, జలుమూరు మండల అధ్యక్షుడు గుంట కర్ణవీరుడు పల్గున్నారు.

GYANESH, IT'S DONE BRO.
చీఫ్ ఎలక్షన్ కమిషనర్
జ్ఞానేశ్ కుమార్
వెంటనే తన పదవికి
రాజీనామా చేయాలి
జిల్లా కాంగ్రెస్ కమిటీ, శ్రీకాకుళం.

విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పుస్తకాల పంపిణీ

మందస, సెప్టెంబరు 30(వార్త): మందసలోని శ్రీ రాజా శ్రీనివాస్ స్మారక ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఇదే పాఠశాలలో 1985-90లో విద్యాభ్యాసన చేసి, విదేశాల్లో స్థిరపడిన కిల్లంశెట్టి కరుణాకర్(వస్త్రాల వ్యాపారి కిల్లంశెట్టి సీతారాం, బొంబే డైయింగ్ కుమారుడు) గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా 8వ తరగతి విద్యార్థులకు వీటిని అందించారు. ప్రతీ రోజూ ప్రత్యేక తర్ఫీదు తరగతులు నిర్వహించే ఉపాధ్యాయులకు కరుణాకర్ ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల విద్య వికాసానికి సహకరిస్తున్నకరుణాకర్‌కు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మక్కా శ్రీనివాసరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పూర్వ విద్యార్థుల సంఘం కోశాధికారి శిష్టు సోమనాథ్ మట్లాడుతూ విద్య విలువ తెలిసినవాడు తన బాల్య మిత్రుడు కావడం నాకు చాలా సంతోషంగా ఉందని కొనియాడారు. కార్యక్రమంలో కిల్లంశెట్టి సత్యం, పాఠశాల ఉపాధ్యాయ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మందసలో ఎంఎల్ఏ శిరీష పర్యటన

మందస, సెప్టెంబరు 30(వార్త): పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీషా అక్టోబరు ఒకటిన మందస మండలంలో గౌతు శిరీషా పర్యటించనున్నారని తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన చెప్పారు. గురువారం ఉదయం 10గంటలకు కొర్రాయి గేటు నుంచి సువర్ణపురం మీదుగా సరియాపల్లి వరకు వేసిన బీటీ రోడ్డు ప్రారంభోత్సవం కార్యక్రమం కొర్రాయి గేటు దగ్గర చేయనున్నారన్నారు. 10.30గంటలకు సువర్ణపురంలో పేదల సేవలో భాగంగా పింఛన్లు పంపిణీ జరుగుతుందన్నారు. 11గంటలకు సువర్ణపురం గ్రామంలో రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని. కార్యక్రమాలను విజయ వంతం చేయాలని బావన దుర్యోధన కోరారు.

దండుగోపాలపురంలో పల్లె పండుగ 3.0

పల్లె పండుగ 3.0
సీసీ రోడ్డు మరియు

సంతబొమ్మాళి, సెప్టెంబరు 30(వార్త): దండుగోపాలపురంలో పల్లె పండుగ 3.0 లో భాగంగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడం,ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం,గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని మండల ఇంజినీరింగ్ అధికారి అంజిత్ ఆధ్వర్యంలో దండుగోపాలపురంలో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆరంగి వసంతరావు, పంచాయతీ యువ నాయకులు బెండి అరుణ్ కుమార్, ఇంజినీరింగ్ సహాయకులు నరేష్, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా సంధ్యారాణి

పలాస, సెప్టెంబరు 30 (వార్త): పలాసలోని సూదికొండ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న తమ్మినాన సంధ్యారాణి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. విద్యార్థుల విద్యాభివృద్ధితోపాటు పాఠశాల అభ్యున్నతికి ఆమె అందిస్తున్న సేవలను గుర్తించి ఈ గౌరవం దక్కడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 19వ వార్డు మాజీ కౌన్సిలర్ ప్రతినిధి శిష్టు గోపి సూదికొండ పెద్దలతో కలిసి సంధ్యారాణిని ఘనంగా సన్మానించారు. దుశ్శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను పెంపొందించడంతోపాటు పాఠశాల అభివృద్ధికి సంధ్యారాణి చేస్తున్న కృషి ప్రశంసనీయమని శిష్టు గోపి తెలిపారు. ఉత్తమ ఉపాధ్యాయురాలిగా జిల్లా స్థాయిలో గుర్తింపు పొందడం సూదికొండ పాఠశాలకు, గ్రామానికి గర్వకారణమన్నారు. భవిష్యత్తులోనూ విద్యారంగంలో మరిన్ని విజయాలు సాధించి విద్యార్థుల అభ్యున్నతికి మరింతగా సేవలందించాలని ఆకాంక్షించారు.

మడపాం టోల్ ప్లాజా వద్ద స్వచ్ఛభారత్

నరసన్నపేట, సెప్టెంబరు 30 (వార్త): నరసన్నపేట మండలం మడపాం టోల్ ప్లాజా వద్ద జాతీయ రహదారి అధికారుల ఆదేశాల మేరకు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. టోల్ ప్లాజా పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సిబ్బంది చర్యలు చేపట్టారు. టోల్ ప్లాజా మీదుగా నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా అవగాహన కల్పిస్తున్నట్లు మేనేజర్ ఆర్. సతీష్‌బాబు తెలిపారు. రహదారి పరిసరాల్లో చెత్త వేయకుండా ప్రయాణికులకు సూచనలు చేస్తున్నామని పేర్కొన్నారు. పరిశుభ్రమైన వాతావరణం కోసం ప్రతి వారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. టోల్ ప్లాజా సిబ్బందితో పాటు ప్రయాణికులు కూడా పారిశుద్ధ్య నిర్వహణలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రయాణికుల సహకారంతో టోల్ ప్లాజా పరిసరాలను మరింత పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా పని చేయాలి

మందస, సెప్టెంబరు 30(వార్త): అంగన్ వాడీ కేంద్రాలు సక్రమంగా పని చేయాలని, అంగన్ వాడీ కార్యకర్తలు తప్పక సమయపాలన తప్పక పాటించాలని ఐసీడీఎస్ మందస ప్రాజెక్టు సీడీపీఓ పి.అరుణ అన్నారు. మందస మండలంలోని హరిపురం-2 సెక్టార్‌లోని చిన్నలొహరిబందలో పరిధిలో అంగన్‌వాడీ ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ అరుణ మాట్లాడుతూ కేంద్రాలను వచ్చే చిన్నారులను సొంతబిడ్డల్లా చూసుకోవాలని కోరారు. క్రమం తప్పకుండా ప్రభుత్వం అందించే పౌష్టికాహారం పంపిణీ చేయాలని సూచించారు. పోషణ మాహ్, సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా షెడ్యూల్ చేయబడిన వివిధ అంగన్వాడీ కేంద్రాలలో అంగన్ వాడీ ఉత్సవాల కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. లబ్ధిదారులకు అంగన్ వాడీ సేవలు, పీఎంఎంవీవై, నవచేతన స్క్రీనింగ్, పోషకాహారం, బాల్య వివాహాలు, మహిళభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఇతర విభాగాలపై అవగాహన కల్పించారు. ఐసీపీఎస్, ఓఎస్సీ, హెల్ప్ లైన్ నంబర్లు, పోషణ్ హెల్ప నంబర్ 1515 తదితర అంశాలను వివరించారు. అనంతరం మఖరజోల, వీరభద్ర కేంద్రాలతో పలు అంగన్ వాడీ కేంద్రాలను సీడీపీఓ సందర్శించి, చిన్నారుల గ్రోత్ రేండం వెరిఫికేషన్ చేశారు. కార్యక్రమాల్లో సీడీపీఓ పి.అరుణతో పాటు, సూపర్ వైజర్లు, అంగన్ వాడీ కార్యకర్తలు, సహాయకులు, లబ్ధిదారులు, ప్రీస్కూల్ చిన్నారులు వారి వారి కేంద్రాల్లో పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఉచిత బియ్యం పంపిణీ

సంతబొమ్మాళి, సెప్టెంబరు 30(వార్త): సంతబొమ్మాళి మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా సముద్రంలో చేపల వేటకు వెళ్లలేని అర్హులైన మత్స్యకార కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బియ్యం పంపిణీ చేస్తోంది. రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు, అర్హులైన మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా సంతబొమ్మాళి రేషన్ షాపు నెం.4 వద్ద బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. మండల నాయకుల ఆధ్వర్యంలో,మండల పౌరసరఫరాల అధికారి రామచంద్ర గారి సమక్షంలో మత్స్యకార కుటుంబాలకు ఉచిత బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ఉపాధ్యక్షులు పుక్కళ్ల శ్రీనివాసరావు, ఏఎంసీ డైరెక్టర్ సూరాడ ధనరాజు, మండల టీడీపీ యువత అధ్యక్షులు కూచెట్టి భానుప్రకాష్, సంతబొమ్మాళి గ్రామ నాయకులు తంగి భాస్కర్, మత్యకార నాయకులు యంపల్లి జోగారావు,గాయత్రీ వసంతరావు,డీలరు అన్నపూర్ణ, లబ్ధిదారులు పాల్గొన్నారు. వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా సముద్రంలో వేటకు వెళ్లలేని మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తూ ఉచిత బియ్యం అందించడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సహాయం మత్స్యకార కుటుంబాలకు తాత్కాలికంగా ఆహార భద్రత కల్పించడంతో పాటు,కష్టకాలంలో వారికి ప్రభుత్వ అండగా నిలుస్తుందని తెలిపారు.

విద్యార్థులు లక్ష్యసాధన దిశగా అడుగులు వేయాలి

SRI VIDYAVAHINI DEGREE COLLEGE
FEST CELEBRATIONS

పలాస, సెప్టెంబరు 30 (వార్త): విద్యార్థులు చిన్ననాటి నుంచే జీవితంలో స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని, దానిని సాధించే దిశగా క్రమశిక్షణతో ముందుకు సాగాలని పాతపట్నం సబ్‌రిజిస్ట్రార్ డా. గురుగుబెల్లి రాజు సూచించారు. శ్రీ విద్యావాహిని డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన నూతన విద్యార్థుల స్వాగత వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ భవిష్యత్తుకు పునాది వేసే కీలకమైన సమయమని తెలిపారు. సమయాన్ని వృథా చేయకుండా ప్రతిరోజూ కనీసం రెండు గంటలు ఏకాగ్రతతో చదువుకు కేటాయించాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరమైన మేరకు మాత్రమే వినియోగించుకోవాలని, ముఖ్యంగా సెల్‌ఫోన్‌కు బానిసలుగా మారకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. జీవితంలో ఎదురయ్యే వైఫల్యాలను చూసి నిరాశ చెందకుండా వాటి నుంచి పాఠాలు నేర్చుకుని ముందుకు సాగాలని, వైఫల్యం విజయానికి వ్యతిరేకం కాదని, విజయానికి దారితీసే అనుభవంలో ఒక భాగమని వివరించారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం సబ్ ట్రెజరీ అధికారి పెరాడ మన్మథరావు విద్యార్థులు మంచి స్నేహభావాన్ని పెంపొందించుకోవడంతో పాటు క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. విద్యార్థి జీవితంలో నైపుణ్యాల అభివృద్ధి, పరస్పర సహకారం, సమయపాలన ఎంతో కీలకమని అన్నారు. చార్టర్డ్ అకౌంటెంట్ యరుకోల మణిదీప్ కూడా విద్యార్థులు చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఐదం గిరిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సెక్రటరీ, కరస్పాండెంట్ పైల తిరుమలరావు, డైరెక్టర్లు పైల మన్మథరావు, పి. సంధ్యారాణి, జి. వినయ్‌కుమార్, పరిపాలన అధికారులు తరిణి కాగేశ్వరరావు, అందాల మురళి పాల్గొన్నారు. అనంతరం సీనియర్ విద్యార్థులు నూతన విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలుకుతూ పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఐదం గిరిబాబు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, కష్టపడి పనిచేస్తూ క్రమశిక్షణతో ముందుకు సాగితే ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్.టి. మాకివలస, జమినివలసలో నూతన రహదారి పనులకు శ్రీకారం

జలుమూరు, సెప్టెంబరు 30 (వార్త): గ్రామాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. ఎస్.టి. మాకివలస, జమినివలస గ్రామాల్లో బుధవారం నిర్వహించిన 'పల్లె పండుగ 3.0'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నూతన రహదారి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. గ్రామీణ ప్రాంతాల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి మెరుగైన రహదారి సౌకర్యాలు ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రజల రాకపోకలకు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు, విద్యా, వైద్య సేవలను సులభంగా పొందేందుకు నాణ్యమైన రహదారులు దోహదపడతాయని తెలిపారు. అనంతరం గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా, మౌలిక వసతుల పరిస్థితిపై ఎమ్మెల్యే ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న లో-వోల్టేజ్ సమస్యలు, విద్యుత్ లీకేజీలు, విరిగిన స్తంభాలు, కొత్త విద్యుత్ స్తంభాల అవసరం తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సాంకేతిక సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఆదివాసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బగ్గు గోవిందరావు, బగ్గు నాయన్న, తహశీల్దార్, ఎంపీడీవో, పంచాయతీరాజ్ అధికారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తూముల శ్రీనివాసరావు ఇంటిపై దాడి యత్నం దుర్మార్గం

పలాస, సెప్టెంబరు 30 (వార్త): పలాస పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, వైసీపీ నాయకులు తూముల శ్రీనివాసరావు నివాసంపై మంగళవారం రాత్రి తెలుగుదేశం పార్టీ నాయకులు దాడికి యత్నించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. రాజకీయ విభేదాలను వ్యక్తిగత దాడులకు దారితీయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని అన్నారు. ఈ మేరకు బుధవారం డాక్టర్ సీదిరి అప్పలరాజు పలాస వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలాస-కాశీబుగ్గ వైశ్య ప్రముఖులతో కలిసి తూముల శ్రీనివాసరావు నివాసానికి వెళ్లారు. జరిగిన ఘటనపై శ్రీనివాసరావు, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన ఆయన, ఎలాంటి పరిస్థితుల్లోనూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. ఘటనపై సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలాస వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపి, పైల వెంకటరమణ (చిట్టి), దువ్వాడ రవి, సుజాత పండ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలి

మొబైల్స్ రిపేర్
మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ యూనియన్
(CITU అనుబంధం)
CITU
పలాస - కాశీబుగ్గ మున్సిపాలిటీ, శ్రీకాకుళం జిల్లా

పలాస, సెప్టెంబరు 30 (వార్త): 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేసి మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గాంధీ విగ్రహం నుంచి మూడు రోడ్ల కూడలి మీదుగా పాత బస్టాండ్ వరకు ర్యాలీను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్. గణపతి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేసి వేతనాలను సవరించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో మృతిచెందిన, పదవీ విరమణ చేసిన కార్మికుల కుటుంబ సభ్యులకు అర్హత మేరకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి మున్సిపల్ కార్మికులందరినీ శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల కొరతతో ఇప్పటికే పనిచేస్తున్న వారిపై అదనపు పనిభారం పడుతోందని, నియామకాల ప్రక్రియను నిలిపివేయడం వల్ల పారిశుధ్య నిర్వహణపై కూడా ప్రభావం పడే పరిస్థితి ఏర్పడుతోందని చెప్పారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని ఎన్. గణపతి హెచ్చరించారు. కార్మికుల హక్కులను కాపాడేందుకు ఐక్యంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె. వెంకటి, బి. కూర్మారావు, ఎం. రవి, కె. ఈశ్వరరావు, ఎస్. రమేష్, రజేష్, ప్రకాష్ ముఖి, శకుంతల, జగ్గుముఖి తదితరులతో పాటు పలువురు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

అధ్యక్ష బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తా

- క్షేత్ర సహాయకుల నూతన అధ్యక్షుడిగా శ్రీరామ్ చాణుక్య

మెళియాపుట్టి, సెప్టెంబరు 30(వార్త): తనపై నమ్మకంతో అప్పగించిన క్షేత్ర సహాయకుల మండల అధ్యక్ష బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని, సంఘం బలోపేతానికి సంఘ సభ్యుల సంక్షేమం కోసం కృషి చేస్తానని క్షేత్ర సహాయకుల నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీరామ్ చాణిక్య అన్నారు. మండల కేంద్రంలో బుధవారం వీబీజీ రామ్ జీ (వికసిత్ భారత్ - గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్) సమావేశానికి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు చెందిన క్షేత్ర సహాయకులు హాజరై క్షేత్ర సహాయకులకు సంబంధించి ఉన్న చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. క్షేత్ర సహాయకుల సంక్షేమ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా శ్రీరాం చాణుక్య, ఉపాధ్యక్షులుగా సిరిపురం జగదీశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా లొడగల శ్రీనివాసరావు, కార్యదర్శిగా రాజు మజ్జి, కోశాధికారి కుసుమూరు గోవర్ధన్ వనజాక్షి, ఈసీ సభ్యులుగా సిరిపురం షణ్ముఖరావు, సవర ప్రసన్న, చిన్నంటి ధనుంజయ, చౌదరి లవకుమార్, అదపాకల మోహన్ లను ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం అందరూ డిప్యూటీ ఎంపీడీవో కి కలిసి క్షేత్ర సహాయకులకు సంబంధించి వివిధ సమస్యలను ప్రభుత్వానికి నివేదించాలని తెలియజేస్తూ విజ్ఞాపన పత్రాన్ని అందించారు. నూతన కార్యవర్గ సభ్యులతో పాటు మండలంలోని క్షేత్ర సహాయకులున్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక

దోపిడీ పాలనను ప్రశ్నిస్తే తట్టుకోలేరా?

-క్రెడిట్ చోరీ చేసేది మీరే.. గత పాలనలో శంకుస్థాపన చేసిన వాటికే మళ్లీ శంకుస్థాపనలు

-వైసీపీ నాయకుడు తూముల శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి బెదిరింపులకు పాల్పడటం సరికాదు..

- వైకాపా నాయకుల ఘాటు విమర్శలు

పలాస, సెప్టెంబరు 30 (వార్త): రైతు బజారు విషయంలో వాస్తవాలను ప్రశ్నించినందుకే వైసీపీ నాయకుడు తూముల శ్రీనివాసరావు ఇంటికి వెళ్లి బెదిరింపులకు పాల్పడటం సరికాదని వైకాపా నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పలాసలో బుధవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు తెలుగుదేశం నాయకుల తీరుపై ఘాటు విమర్శలు చేశారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసిన పలు పనులకే ప్రస్తుతం మళ్లీ శంకుస్థాపనలు చేస్తున్నారని, ప్రజలకు పనులు చేసి చూపించాల్సింది పోయి గత ప్రభుత్వ పనులకు క్రెడిట్ తీసుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. బాధితుడు తూముల శ్రీనివాసరావు మాట్లాడుతూ మార్కెట్ యార్డు అంశంపై తాను దురుద్దేశంతో సామాజిక మాధ్యమాల్లో ఎలాంటి పోస్టు పెట్టలేదన్నారు. గతంలో అదే ప్రాంగణంలో మాజీ మంత్రి, అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ సీదిరి అప్పలరాజు రైతు బజారు ఏర్పాటుకు స్థలం కేటాయించిన విషయాన్ని, ఆ సమయంలో కొంతమంది తెలుగుదేశం నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి పనులను నిలిపివేయించిన విషయాన్ని మాత్రమే సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్నానన్నారు. ఈ పోస్టుతో మనస్తాపానికి గురైన కొంతమంది టీడీపీ నాయకులు తన ఇంటికి వచ్చినట్లు తెలిపారు. తన ఎదుగుదలను తట్టుకోలేక టంకాల రవిశంకర్ గుప్తా, శాసనపురి మురళీకృష్ణ, జోగ మల్లి తదితరులు తనపై తప్పుడు ప్రచారం చేస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పలాస ఏఎంసీ మాజీ చైర్మన్ పి.వి. సతీష్ మాట్లాడుతూ డాక్టర్ సీదిరి అప్పలరాజు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కాశీబుగ్గ బజారులోని చిన్నచిన్న వ్యాపారులకు ఉపయోగపడేలా రైతు బజారు ఏర్పాటు చేయాలని నిర్ణయించారని తెలిపారు. గతంలోనే ప్రభుత్వాలు రైతు బజారు ఏర్పాటుకు ప్రయత్నించాయని, వైకాపా ప్రభుత్వ హయాంలో తాను ఏఎంసీ చైర్మన్‌గా ఉన్నప్పుడు రైతు బజారు కోసం రూ.45 లక్షలు మంజూరు చేసి, మూడు రోడ్ల కూడలి వద్ద ఉన్న పాఠశాల సమీపంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. అయితే అదే సమయంలో కొంతమంది టీడీపీ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పనులు నిలిచిపోయాయని వివరించారు. ఈ విషయాన్నే తూముల శ్రీను సామాజిక మాధ్యమాల్లో ప్రస్తావించారని తెలిపారు. రైతు బజారు విషయంలో 'క్రెడిట్ చోరీ' చేస్తున్నారని ప్రశ్నించినందుకే టీడీపీ నాయకులకు ఆగ్రహం వచ్చిందా? అని సతీష్ ప్రశ్నించారు. రైతు బజారు విషయంలో క్రెడిట్ చోరీ జరుగుతోందనే విషయాన్ని వైకాపా తరఫున తాము ఇప్పటికీ ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. తూముల శ్రీనివాసరావు ఇంటి చుట్టుపక్కల కొంతమందిని ఉంచి, రాత్రి సమయంలో ఆయన ఇంటికి వెళ్లి బెదిరించడం సినిమా క్లైమాక్స్‌ను తలపించేలా ఉందని వ్యాఖ్యానించారు. కక్షపూరిత రాజకీయాలతో ఒకే సామాజిక వర్గంలో వైషమ్యాలు సృష్టించడం సరికాదన్నారు. గతంలో శంకుస్థాపన చేసిన పనులకు మళ్లీ శంకుస్థాపనలు చేయడం కంటే వాటిని పూర్తి చేసి ప్రజలకు ఉపయోగపడేలా చేయాలని సూచించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో పలువురికి తాము పనులు చేసి పెట్టామని, ఇప్పుడు రాజకీయంగా ఎదగాలనే ఉద్దేశంతో బెదిరింపులు, బలప్రదర్శనలకు పాల్పడటం సరికాదన్నారు. నిజంగా రాజకీయ నిబద్ధత ఉంటే పార్టీ అధినాయకత్వం ద్వారా అభ్యర్థిత్వం సాధించుకోవాలని సూచించారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే ప్రజాక్షేత్రంలోనే తగిన సమాధానం చెబుతామని అన్నారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బోర కృష్ణారావు మాట్లాడుతూ రైతు బజారు విషయంలో టీడీపీ నాయకుల తీరు సరికాదన్నారు. గతంలో వారు సామాజిక మాధ్యమాల్లో చేసిన పోస్టులను పరిశీలించాలని కోరారు. రైతు బజారు ఏర్పాటును నిలిపివేయాలని గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారే ఇప్పుడు అదే అంశంపై ప్రశ్నిస్తే తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. పట్టణ వైకాపా అధ్యక్షుడు శిష్టు గోపి మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ వ్యవహరిస్తున్న తీరుకు కొనసాగింపుగానే పలాస నియోజకవర్గంలోనూ అదే సంస్కృతిని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. రైతు బజారును గత వైకాపా ప్రభుత్వం ఏర్పాటు చేయాలని భావించిన సమయంలో టీడీపీ నాయకులే ఫిర్యాదులు చేసి అడ్డుకున్నారని ఆరోపించారు. గతంలో ఎస్సీ వసతి గృహం ఉన్న ప్రదేశంలో అప్పటి ఎమ్మెల్యే గౌతు శివాజీ శంకుస్థాపన చేసినప్పటికీ, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కొంతమంది న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయిందని తెలిపారు. ఆ విషయాన్ని వైకాపాకు ఆపాదించడం సరికాదన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో డోకి హరీష్ మృతి ఘటన, పి.వి. సతీష్‌పై దాడి ఘటనలను ప్రస్తావించిన గోపి.. గతాన్ని మరిచి ఇప్పుడు టీడీపీ నాయకులు మాట్లాడటం సరికాదన్నారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని హెచ్చరించారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కృషితోనే గతంలో రైతు బజారుకు స్థలం కేటాయించారని తెలిపారు. వాస్తవాలపై చర్చించేందుకు తాము బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. బెదిరింపులకు వెనక్కి తగ్గే నాయకులు పలాసలో ఎవరూ లేరని గోపి స్పష్టం చేశారు. రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఒకరి ఇంటికి వెళ్లి బెదిరింపులకు పాల్పడటం, అలాంటి చర్యలను ప్రోత్సహించడం సరికాదన్నారు. పలాస ఎమ్మెల్యే పాలనపై ప్రజల్లో అసంతృప్తి నెలకొందని, ఆ అసంతృప్తిని తట్టుకోలేకనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇసుక, ఊక, కంకర, భూ వ్యవహారాలు, మద్యం బాటిల్‌పై అదనపు ధరల వసూళ్లపై ప్రజల్లో అసంతృప్తి ఉందని, అందుకే ప్రస్తుత పాలనను 'దోపిడీ పాలన'గా ప్రజలు భావిస్తున్నారని వ్యాఖ్యానించారు. 'మీ పాలనలో తహసీల్దార్ ప్రాణాలకు రక్షణ లేదని గతంలో ప్రకటన చేసిన మాట వాస్తవం కాదా?' అని ప్రశ్నించారు. ప్రస్తుతం తమ పార్టీ నాయకులకు ఇబ్బందులు కలిగించవచ్చని, అయితే రాజకీయాల్లో ప్రతి ఒక్కరికీ సమయం వస్తుందని, ప్రజాక్షేత్రంలోనే తగిన సమాధానం ఇస్తామని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మల్లా సురేష్, మాజీ ఎంపీపీ ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, మాజీ ఎంపీపీ బత్తిన హేమేశ్వరరావు, శ్రీను మాస్టారు, నర్తు వెంకటరమణ, శాసుమాను శ్యామసుందర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య



సంతబొమ్మాళి, సెప్టెంబరు 30(వార్త): నౌపడ గ్రామానికి చెందిన గిన్ని పద్మావతి (57) అనే మహిళ బుధవారం తన ఇంటిలో ఆత్మహత్య చేసుకుని చనిపోయింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తన భర్త నూకరాజు చనిపోవడంతో అప్పటినుండి భార్య పద్మావతి మతిస్థిమితం కోల్పోయి చిన్న కుమారుడు కోటేశ్వరరావు దగ్గర ఉంటుంది. ఎప్పటికప్పుడు వీధిలో కేకలు ఉండేదని, ఎక్కడికి వెళ్లినా రెండు మూడు రోజుల తర్వాత ఇంటికి వచ్చేదని తెలిపారు. ఇటీవల గ్రామంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించగా గ్రామస్తులు చూసి రక్షించాలని తెలిపారు. బుధవారం కుమారుడు కోటేశ్వరరావు పని నిమిత్తం బయటకు వెళ్ళగా కోడలు గాయత్రి పలాస బంధువుల ఇంటికి వెళ్ళింది. దీంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న పద్మావతి చెరువు కి వెళ్లి స్నానం చేసి ఇంటికి వచ్చి అపస్మారక స్థితిలో పడి ఉంది. వీధిలో ఉన్నవారు చూసి కుమారుడికి సమాచారం ఇవ్వటంతో ముందు నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స చేసి టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే చనిపోయిందని డాక్టర్లు నిర్ధారించారు. మా అమ్మ చనిపోవడానికి బ్లేడుతో చేయి కోసుకోవడంతో తీవ్ర రక్తస్రావం అయిందని, సూపర్ వాస్మల్ 33 ఆయిల్ తాగి ఉండవచ్చునని కుమారుడు కోటేశ్వరరావు ఫిర్యాదులో తెలిపారు. ఎవరిమీద అనుమానం లేదని తెలియజేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నౌపడ ఎస్సై నారాయణస్వామి తెలిపారు.

పాత టెక్కలిలో ఘనంగా పోషణ మాసోత్సవాలు

పలాస, సెప్టెంబరు 30 (వార్త): పాత టెక్కలి అంగన్‌వాడీ కేంద్రంలో కాశీబుగ్గ సమగ్ర శిశు అభివృద్ధి పథకం ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలు, అంగన్‌వాడీ ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ప్రాధాన్యాన్ని వివరించడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సమగ్ర శిశు అభివృద్ధి పథకం పర్యవేక్షకురాలు యు. లత మాట్లాడుతూ చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు తల్లిదండ్రులకు నిరంతరం అవగాహన కల్పించాలని ఆమె తెలిపారు. ఇంటి పరిసరాల్లో అందుబాటులో ఉండే పప్పుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తదితర పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను సమతుల్యంగా తీసుకునేలా ప్రజలకు సూచనలు ఇవ్వాలని తెలిపారు. ఈ సందర్భంగా సేవలందిస్తున్న అంగన్‌వాడీ సిబ్బందిని సన్మానించి అభినందించారు. కార్యక్రమం అనంతరం పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు ఎం. మంజుల, కార్యకర్తలు కరుణ, దామయంతి, పార్వతి, పుష్ప, 21 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. .

డాక్టర్ ప్రదీప్ సేవలకు బాలిక ఫిదా

సోంపేట, సెప్టెంబర్ 30(వార్త): సోంపేట పట్టణంలో చిన్న పిల్లల వైద్యునిగా సేవలందిస్తు అందరి చేత ప్రశంసించబడుతున్న డాక్టర్ మంచు ప్రదీప్ తన పట్ల ఎంతో కరుణతో సేవలందించి పునర్జన్మ ప్రసాదించడంలో ముఖ్య భూమిక పోషించిన నేపథ్యంలో ఓ బాలిక బుధవారం డాక్టర్ ప్రదీప్ ను కలసి కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా డాక్టర్ కు అందమైన జ్ఞాపికను బహుకరించింది. వివరాల్లోకి వెళితే.... కవిటి మండలం సహలాల పుట్టుగ పంచాయతీ మడియార పుట్టుగ గ్రామానికి చెందిన ప్రణవి అనే బాలిక సుమారు నెలరోజుల క్రితం గ్రామంలో పాముకాటుకు గురైంది. క్లిష్టమైన పరిస్థితుల్లో బాలికను సోంపేట లో గల డాక్టర్ మంచు ప్రదీప్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. డాక్టర్ ప్రదీప్ బాలిక విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సరైన వైద్యాన్ని అందించారు. మూడు రోజులు తర్వాత బాలిక పరిస్థితి మెరుగుపడింది. అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం పంపించారు. కొద్దిరోజుల తర్వాత సాధారణ స్థితికి చేరుకున్న వెంటనే ఇంటికి చేరుకున్న బాలిక మామూలు పరిస్థితికి చేరుకుని సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుంది. ఈ పరిస్థితుల్లో బాధిత బాలిక తల్లిదండ్రులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. వైద్యులు అందించిన సహాయాన్ని ఎన్నటికీ మర్చిపోలేమంటూ కృతజ్ఞతగా బుధవారం డాక్టర్ ప్రదీప్ ఆస్పత్రికి చేరుకొని వైద్యుల్ని కలిసి సంతోషం వ్యక్తం చేశారు. డాక్టర్ ప్రదీప్ అందించిన సేవలు పట్ల కృతజ్ఞతగా బాలికచే జ్ఞాపికను అందించారు. ఈ సంఘటన పట్ల డాక్టర్ మంచు ప్రదీప్ ఆనందం వ్యక్తం చేశారు. ఎటువంటి ఆపదలోనైనా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

వైకాపా నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు

సంతబొమ్మాళి, సెప్టెంబరు 30(వార్త): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం దిశగా ముందుకు సాగుతున్న నమ్మకం విశ్వాసంతో పలువురు వైకాపా నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్న టీడీపీ ప్రభుత్వ విధానాలపై నమ్మకంతో వారు వైకాపాను వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. హెచ్.ఎన్.పేటగ్రామ పంచాయతీ నుంచి వైయస్సార్ పార్టీ కి చెందిన సుమారు 50 కుటుంబాలు కు చెందిన 150 మంది వైకాపా ముఖ్య నాయకులు, కార్యకర్తలు బుధవారం నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు పార్టీలో చేరిన వారిని సాదరంగా ఆహ్వానించి, పార్టీ కండువాలు కప్పి హృదయపూర్వకంగా అభినందించారు. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి, ప్రజాసేవకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రానికి అభివృద్ధి, ప్రజలకు సంక్షేమం అందించే లక్ష్యంతో టీడీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్న తెలుగుదేశం పార్టీపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందన్నారు ఈ కార్యక్రమం లో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుగ్గు శాంతి స్వరూప్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు ఎల్ ఎల్ నాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు పుక్కళ్ల శ్రీనివాస్, దుపా రమణారెడ్డి, హెచ్ ఎన్ పేట మాజీ సర్పంచ్ కోళ్ల భాస్కరరావు, దల్లి రాజన్న రెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కస్తూర్బా విద్యార్థినులు

- రిత్వికా గోల్డ్ డైరెక్టర్ దినేష్ ఆర్థికసాయం

- ప్రయాణ ఖర్చులకు రూ.10,000 అందజేత

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 30(వార్త): విద్యార్థినులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని రాష్ట్రస్థాయిలో రాణించేలా ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రిత్వికా గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ పైడిశెట్టి దినేష్ కుమార్ అన్నారు. ఇచ్ఛాపురంలోని కస్తూర్బా పాఠశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయి అండర్-19 చదరంగం (చెస్), రగ్బీ పోటీలకు ఎంపిక కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్, ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థినులు దినేష్ కుమార్‌ను కలిశారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు సమీపంలోని పెదవేగిలో నిర్వహించనున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు హాజరయ్యేందుకు ప్రయాణ ఖర్చుల నిమిత్తం రూ.10,000 ఆర్థిక సహాయాన్ని ఆయన అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు చెస్ విభాగం లో కె.చాందిని - 10వ తరగతి, ఎం. కీర్తి - 10వ తరగతి,రగ్బీ విభాగం లో, జి. అంజలి - 10వ తరగత,ఈ. దీక్ష -10వ తరగత, ఎ. గౌరి - 10వ తరగతి,జి. కౌసల్య - 9వ తరగతి లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ మాజీ చైర్మన్ ఐ. భారతి, ఐ. రామారావు, పి. శ్రీను, బత్తిన కృష్ణయ్య, కోయిల రామారావు, మాటూరు నవీన్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. శిరీష, పీఈటీ ఎం. భారతి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 30(వార్త): ఇచ్ఛాపురం బార్ అసోసియేషన్‌కు చెందిన సభ్యులందరూ ఏకగ్రీవంగా విజయవాడలో న్యాయవాదులపై పోలీసులు వ్యవహరించిన దురుసు మరియు అనుచిత ప్రవర్తనకు నిరసన గా న్యాయస్థానంలోని కోర్టు కార్యకలాపాలకు హాజరు కాకుండా ఉండాలని నిర్ణయించారు. విజయవాడలో న్యాయవాదులపై జరిగిన పోలీసుల దౌర్జన్యాన్ని సంయుక్తంగా తీవ్రంగా ఖండిస్తున్నామని ఈ ఘటనపై స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాత విచారణ జరిపి, ఘటనకు బాధ్యులైన వారిపై తగిన చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసారు. ప్రదర్శన సందర్భంగా పోలీసు సిబ్బంది మరియు రోప్ పార్టీ సభ్యులు న్యాయవాదులపై దురుసుగా ప్రవర్తించారని . కోట వలస అసోసియేషన్ అధ్యక్షుడు వి. లక్ష్మీ నారాయణ, ఉపాధ్యక్షుడు బి. లెనిన్, జనరల్ సెక్రటరీ వి. కిరణ్ కుమార్‌లను నెట్టివేసి కింద పడేశారని, . అడ్వకేట్లు ఏ.ఎస్. రామ్ ప్రసాద్, గిరి సంపత్ శ్రీనివాసరావు, మరో ఇద్దరు న్యాయవాదులతో పాటు మహిళా న్యాయవాదులు శ్రీమతి చైతన్య మరియు గవర్నింగ్ బాడీకి చెందిన మహిళా సభ్యులపై కూడా పోలీసులు దురుసుగా ప్రవర్తించారని అన్నారు. ఈ దురుసు ప్రవర్తనలో పురుష రోప్ పార్టీ సిబ్బంది మహిళా న్యాయవాదుల జుట్టు లాగడం, అలాగే ఇతర హైహ్యాండెడ్ చర్యలకు పాల్పడటం జరిగినట్లు తీర్మానంలో పేర్కొన్నారు. ఈ సంఘటనలో న్యాయవాదులందరికీ సంపూర్ణ మద్దతును తెలియజేస్తూ, వారి న్యాయబద్ధమైన డిమాండ్లకు తా మంతా ఐక్యంగా, దృఢంగా సంఘీభావం ప్రకటిస్తున్నామని , అవుట్ ఆఫ్ ఆర్డర్ కేసులు, స్ట్రైక్ కేసులు మరియు బెయిల్ దరఖాస్తులు ఈ నిరసన నుండి మినహాయించబడతాయని చెప్పారు. ఈ కార్యక్రమం లో అధ్యక్షులు నందికి రమణయ్య రెడ్డి , కార్యదర్శి యం. రాంబాబు, ఉపాధ్యక్షులు ప్రేమలత పట్నాయక్, సంయుక్త కార్యదర్శి డి. కృష్ణ మూర్తి రెడ్డి, ట్రెజరర్ ఆర్. దేవరాజు రెడ్డి, సభ్యులు గిన్ని సీతయ్య రెడ్డి, యన్. సి. సాహు,సోమశేఖర్ రెడ్డి, యస్. యల్. నారాయణ, రంగారావు, బైరాగి రెడ్డి,మనోజ్ కుమార్ సామాంతో, బి. జి.గోవింద్, సోమేశ్వర రెడ్డి, జె.కామేష్ రెడ్డి ,సూర్య నారాయణ, ధర్మ, పాల్గొన్నారు.

బాధితలకు అండగా సిఎం రిలీఫ్ ఫండ్

పాతపట్నం, సెప్టెంబరు 30 (వార్త) : బడ్డుమర్రికి చెందిన ఆముపురం లావణ్య ఇటీవలే వైద్యం చేయించుకొని వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక ఇబ్బందులను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు వద్ద విన్నవించుకోగా, ఆమెకు ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేపించి ఆ కుటుంబానికి సిఎంఆర్ఎఫ్ ద్వారా 1,06,153 రూపాయల చెక్ ను స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గోవిందరావు అందించారు. వైద్యం చేయించుకునే ఆర్థికస్థోమత లేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఉదారంగా ఆర్థిక సాయం అందించి అండగా ఎన్డీఏ ప్రభుత్వం నిలుస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.

ధర్మపురం ఓవర్ హెడ్ ట్యాంకును మార్చండి

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 30(వార్త): ఇచ్ఛాపురం మండలం ధర్మపురం గ్రామంలో మంచి నీరు సరఫరాకు ఏర్పాటు చేసిన 60000 లీటర్లు కెపాసిటీ గల ఓవర్ హెడ్ ట్యాంక్ శిదిలావస్తకు చేరుకుందని, తులసిగాం, ధర్మపురం రెండు గ్రామాలకు సరఫరాకు ఉద్దేశించిన ఈ ట్యాంక్ నుండి వాటర్ లీక్ అవ్వడమే కాకుండా ట్యాంక్ పెచ్చులూడిపోయిందని, మెట్లు మార్గం పాడవటం వలన రెగ్యులర్ షెడ్యూల్ క్లీనింగ్ అవకాశం లేకుండా పోయిందని, సంబంధిత అధికారులు స్పందించి ట్యాంక్ ఇంటిగ్రిటి చెక్ చేసి పునరుద్దరణ చేయగలిగే అవకాశం వుంటే మరమ్మత్తులు వెంటనే చెపట్టాలి కుదరకపోతే కొత్త ట్యాంక్ నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుకుంటున్నారని నియోజకవర్గ వైస్సార్సీపీ సమన్వయ కర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో ఆశి కృష్ణ రెడ్డి,నర్తు ప్రేమ్ కుమార్ , పిట్ట విశ్వనాథం, పిట్ట బాలరాజు, జగదీష్ , గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

పైల నరసింగో కుటుంబానికి జనసేన నాయకుల ఆర్థికసాయం

vivo T5 Pro
AJAY 09/30/2026 10:11

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 30(వార్త): ఇచ్ఛాపురం మున్సిపాలిటీ 1వ వార్డు పురుషోత్తపురానికి చెందిన జనసేన కార్యకర్త పైల నరసింగో ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందారు. విషయం తెలుసుకున్న జనసేన నియోజకవర్గ నాయకులు రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు పిలుపు మేరకు జనసేన నాయకులు నరసింగో కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. కష్టకాలంలో నరసింగో కుటుంబానికి జనసేన పార్టీ అండగా ఉంటుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసరి శేఖర్, పటన రుక్మాంగధర, లాది శ్యాంసుందర్, అనపాన రమేష్, కలియ గౌడ్, దుదిష్టి సాహూ తదితరులు పాల్గొన్నారు.

బెల్లుపడ కాలనీలో అంగన్వాడి ఉత్సవం

ఇచ్ఛాపురం, సెప్టెంబరు 30(వార్త): మున్సిపాలిటీ పరిధి 23వ వార్డు బెల్లుపడ కాలనీలో అంగన్వాడి ఉత్సవం కార్యక్రమం నిర్వహించారు .కాలనీ కృష్ణ మందిరం ఆవరణలో సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమం చేపట్టారు.ఐ సిడియస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బెల్లుపడ కాలనీ, రామలింగేశ్వర వీధి, బృందావన హడ్కో కాలనీ అంగన్వాడి కేంద్రాలు సంయుక్తంగా ఈ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు జి ప్రదీప్ కుమార్, బి పార్వతీశ్వర్ రెడ్డి,తెలుగుదేశం పట్టణ కార్యదర్శి శాసన శేఖర్,ఎం వైకుంఠరావు సంతోష్ రతో,బచ్చు శంకర్, కడియం గోపాల్ ఆచారి,అంగన్వాడి కార్యకర్తలు కమల,పుష్పాంజలి, లాలిత్య ప్రాజెక్ట్ ఆఫీసర్ కె. శ్రీలత, పాపి నాయుడు సూపర్వైజర్లు నేలవేణి,కృష్ణవేణి పుష్పలత,శాంతి కుమారి సంతోషి బెహరా తదితరులు పాల్గొన్నారు.

అమర జవాన్ కుటుంబాన్ని పరామర్శించిన బలగ ప్రవీణ్‌కుమార్

పోలాకి, సెప్టెంబర్ 30 (వార్త): పోలాకి మండలం పోలాకి గ్రామంలోని ఇందిరానగర్‌లో అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన వీర జవాన్ కిరణ్‌కుమార్ కుటుంబాన్ని నరసన్నపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి బలగ ప్రవీణ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. జవాన్ కుటుంబ సభ్యులను స్వయంగా కలిసి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దేశ సేవలో విధులు నిర్వర్తించిన కిరణ్‌కుమార్ సేవలను స్మరించుకున్నారు. దేశం కోసం సేవలందించిన జవాన్ కుటుంబం చేసిన త్యాగం ఎప్పటికీ గుర్తుండిపోతుందని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, వారి దుఃఖంలో తాము భాగస్వాములమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని కిరణ్‌కుమార్ కుటుంబానికి తమ సంఘీభావాన్ని తెలిపారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

వాలంటీర్లు చేసిన పాపమేంటి బాబూ? :

పాతపట్నం, సెప్టెంబర్ 30(వార్త) : వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడం నేరమా అని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఓ ప్రకటన బుధవారం విడుదల చేశారు. వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం హయాంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయంను తీసుకుని వచ్చి, సచివాలయం ఉద్యోగాలను కల్పించి వారికి అనుసందానంగా వాలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేశారని, ప్రతి ఒక్క ప్రభుత్వం పథకాన్ని ప్రతి ఇంటికి చేరవేయాలనే ఒక గొప్ప ఆలోచనతో ఈ వాలంటీర్లు వ్యవస్థను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. 2019 నుండి 2024 వరకు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచి, కరోనా మహమ్మారికి బయపడి ప్రజలు ఇళ్ల నుండి బయటకు రాకపోయినా ప్రాణాలకు తెగించి సేవలు అందించిన ఘనత వాలంటీర్లదని ఆమె పేర్కొన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాలంటీర్లుకి ఇచ్చిన హామీలను ప్రక్కన పెట్టి వారిని తొలగించి వారి కడుపు కొట్టారని ఆమె మండిపడ్డారు. ప్రభుత్వ సొమ్మంటే ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిందని, కానీ ఇప్పుడు ప్రచారానికి వేలకు వేలు ఖర్చు చేసి దాన్ని ఇన్ఫ్లుయెన్సర్ల ముసుగులో మీ కార్యకర్తలకు ఇవ్వటం కరెక్టా? అని ఆమె ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎన్నికల సమయంలో వాలంటీర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చి, విధుల్లోకి తీసుకోవాలని రెడ్డి శాంతి డిమాండ్ చేశారు.

ఎర్ర చెరువులో పడి వ్యక్తి మృతి

పలాస, సెప్టెంబరు 30 (వార్త): పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పురుషోత్తపురం వీధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. స్థానిక ఎర్ర చెరువులో ప్రమాదవశాత్తు పడి ఓ వ్యక్తి నీటిలో మునిగి మృతి చెందాడు. పురుషోత్తపురానికి చెందిన అల్లం చిట్టి హేమసుందర్ (40) ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయినట్లు స్థానికులు తెలిపారు. చెరువులో పడిన విషయాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే స్పందించి హేమసుందర్‌ను బయటకు తీసేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. హేమసుందర్ ప్రమాదవశాత్తు చెరువులో పడి నీటిలో మునిగిపోవడంతోనే మృతి చెందినట్లు దానికి తెలిపారు . ఈ ఘటనకు దారితీసిన పూర్తి కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని తదుపరి ప్రక్రియ నిమిత్తం తరలించే ఏర్పాట్లు చేశారు. హేమసుందర్ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాద చాయిలు అలుముకున్నాయి. ఈ ఘటనతో పురుషోత్తపురం ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు లక్ష్యసాధన దిశగా పయనించాలి

మందస, సెప్టెంబరు 30(వార్త): విద్యార్థి దశ నుంచే లక్ష్యసాధన దిశగా పయనించాలని మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు. మందస మండలంలోని వీరగున్నమ్మపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తమ భవిష్యత్ ను ఇప్పటి నుంచే నిర్ధేశించుకుని, లక్ష్యాలను చేరుకోవాలన్నారు. చెడు సాన్నిహిత్యం, చెడు అలవాట్లకు లోనుకావద్దని హితవు పలికారు. కొత్త చట్టాలు కఠినంగా ఉన్నాయని, మంచి మార్గంలో నడవాలన్నారు. ర్యాగింగ్ కు దూరంగా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పే మంచిని అలవర్చుకుని, సన్మార్గంలో నడిచి, తల్లిదండ్రులు.. సమాజానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రపురంలో ఎత్తిపోతల పథకం పునఃప్రారంభం

జలుమూరు, సెప్టెంబరు 30 (వార్త): జలుమూరు మండలం వెంకటాపురం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురంలో చోరీకి గురైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన పనులను పూర్తి చేశారు. కేంద్ర మంత్రి మంజూరు చేసిన రూ.10 లక్షల నిధులతో చేపట్టిన ఈ పనులు పూర్తికావడంతో పథకాన్ని బుధవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎత్తిపోతల పథకం ద్వారా రైతులకు సాగునీటి సదుపాయం అందుతుందని తెలిపారు. పథకం సక్రమంగా పనిచేసేలా సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఉపయోగపడే సాగునీటి వసతులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చోరీ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, పథకం పునఃప్రారంభంతో కొంత ఉపశమనం లభించింది. ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందుబాటులో ఉండటంతో పంటల సాగుకు ప్రయోజనం కలుగుతుందని రైతులు పేర్కొన్నారు. పథకంలోని పరికరాలను భద్రంగా ఉంచడంతో పాటు ఎలాంటి నష్టం జరగకుండా రైతులు, స్థానికులు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.

గ్రామ స్థాయిలో వైఎస్సార్ సీపీ బలోపేతమే లక్ష్యం

జి.సిగడాం, సెప్టెంబరు 30(వార్త): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గ్రామ, క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేయడమే మన అందరి ప్రధాన లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే ఎచ్చెర్ల నియోజకవర్గ సమన్వయకర్త గొర్లె కిరణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆనందపురం, దవళపేట గ్రామపంచాయితీ ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలతో గ్రామ స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. అయెన మాట్లాడారు. వైఎస్సార్సీపీకి గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలే అసలైన బలం అని, వారందరూ నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.గ్రామ స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ అండగా నిలవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసికట్టుగా శ్రమించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి రెండు నర సంవత్సరాలు గడుస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామిలు నేరవేర్చడంతో విఫలం చెందిదని అబద్దపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబు నైజమన్నారు. కూటమి ప్రభుత్వ వైపల్యాలను ఎప్పుటికప్పుడు ప్రజలకు తెలియజేయాలన్నారు.ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభ వ, 20 లక్షల ఉద్యోగాల కల్పన వంటి హామీలను అమలు చేయలేదన్నారు. అనంతరం నాయకులకు, కార్యకర్తలకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. అధికారంలోకి రాగానే ప్రతీ కార్యకర్తకు మేలు జరుగుతుందన్నారు.స్థానిక సంస్థల ఎన్నికలలో వైసిపి అభ్యర్థిలు గెలుపుకు ప్రతీ ఒక్క కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు డోల వెంకటరమణ, మాజీ ఎంపీపి ప్రతినిధి మీసాల వెంకటరమణ, మాజీ జెడ్పిటీసి కాయల రమణ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పేడాడ శ్రీరామమూర్తి,జిల్లా అధికారి ప్రతినిధి పిల్లల శివ కుమార్, మాజీ సర్పంచ్లు చిత్తిరి మోహన్, చిత్తిరి మంజు,వడిశ మహేశ్వరావు, నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు ఈసర్ల గోవిందరావు, నాయకులు మక్క వెంకటసాయి, మక్క సాయి తేజ, చిత్తిరి గరికి నాయుడు, అబోతుల విశ్వేశ్వర రావు,అబోతుల శ్రీనివాసరావు, పేడాడ కృష్ణం రాజు, పేడాడ శ్యామల రావు, పేడాడ శ్రీనివాసరావు,మక్కా సాయి, మహిళా కార్యకర్తలు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండుగతో గ్రామాల రూపురేఖల్లో మార్పు

పల్లె పండగ 3.0
జలుమూరు మండలం - శ్రీకాకుళం

జలుమూరు, సెప్టెంబరు 30 (వార్త): పల్లెలే రాష్ట్ర ప్రగతికి పట్టుకొమ్మలని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. జలుమూరు మండలం చల్లవానిపేట గ్రామంలో 'పల్లె పండుగ 3.0' కార్యక్రమంలో భాగంగా రూ.6 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు పనులకు బుధవారం ఆయన భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడంతో పాటు స్థానికంగా ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి వాటిని ప్రాధాన్యత క్రమంలో చేపట్టడం ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. చల్లవానిపేటలో చేపట్టనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణంతో స్థానిక ప్రజల రాకపోకలకు మరింత సౌకర్యం కలగనుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీ, తాగునీరు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. గ్రామాల అభివృద్ధి వేగవంతమైతేనే రాష్ట్ర ప్రగతి మరింత ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ మార్గదర్శకుడు 'సోములయ్య'

-ఘనంగా ఉద్యోగ విరమణ సభ

-అడవిబిడ్డగా ప్రజా సమస్యలపై పోరు

-కవిత్వంతో వెలుగులోకి సమాజంలోని అసమానతలు

-మేథావులు, ప్రజాసంఘాల నాయకుల ప్రశంసలు

మందస, సెప్టెంబరు 30(వార్త): సమాజానికి సవర సోములయ్య మార్గ నిర్దేశకుడని పలువురు ప్రజా సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, మేథావులు, గిరిజన సంఘం నాయకులు అన్నారు. కవి, రచయిత, గాయకుడు, ఆదర్శవాది, గిరిజన సంఘం నేత, ఉపాధ్యాయుడు సవర సోములయ్య ఉద్యోగ విరమణ సభ మందస మండలంలోని కిల్లోయికాలనీలో జరిగింది. కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ సోములయ్య జీవితాంతం ఆదర్శవాదిగానే జీవిస్తున్నారన్నారు. ఆయన ఎంతో సౌమ్యుడని, సోములయ్య భార్య శాంతమ్మ కూడా భర్తకు తగ్గ భార్యగా శాంతమూర్తిగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. సోములయ్య ఉపాధ్యాయునిగా విద్యార్థులను ఉన్నత శిఖరాలు అధిరోహించేలా కృషి చేశారన్నారు. అదేవిధంగా తన కలంతో అభ్యుదయ వాదిగా మంచి రచనలు చేశారని, సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు వెలుగులోకి తీసుకువస్తున్నారన్నారు. మంచి రచనలు చేస్తూ.. సమాజాన్ని మేల్కొపుతున్నారని ప్రశంసించారు. ఆదివాసీ బిడ్డగా గిరిజనులను చైతన్యం చేస్తున్నారన్నారు. 40ఏళ్ల ఉపాధ్యాయ సుదీర్ఘ జీవితంలో సోములయ్య మంచితనాన్ని మాత్రమే గడించుకున్నారన్నారు. సోములయ్య ప్రతీ ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తారన్నారు. ఈ సందర్బంగా సవర సోములయ్య, శాంతమ్మ దంపతులుకు ఘనంగా సన్మానించారు. తూర్పు కనుమల మాటున ఎర్ర మందారం సవర సోములయ్య కవి, రచయిత, ఉపాధ్యాయునిగా సవర సోములయ్య తూర్పు కనుమల మాటున, మహేంద్రగిరులలో ఉదయించిన ఎర్రమందారమని పలువురు మేథావులు అన్నారు. సోములయ్య రచించిన వనవాసి అక్షర కెరటాలు పుస్తకాన్ని కుల నిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర నాయకుడు మిస్క కృష్ణయ్య ఆవిష్కరించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ సోములయ్య రచనలు సమాజాన్ని మేల్కొలిపేలా ఉంటాయన్నారు. సుబ్బారావుపాణిగ్రాహి నడయాడిన నేలపై సోములయ్య జన్మించి, పాణిగ్రాహి వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్నారన్నారు. ఆయన రచనలు దోపిడిని ప్రశ్నిస్తాయని, అన్యాయాలను ఎదిరిస్తాయన్నారు. ప్రజల్లో మమేకమైన ఆయన సేవలు కొనసాగాలని ఆకాంక్షించారు. టెక్కలిలో రైలు కింద పడి మరణించిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతం నుంచి కనీసం ఒక్క ఆదివాసీ నాయకుడు కూడా ప్రశ్నించకపోవడం దురదృష్టకరమన్నారు. గిరిజనుల్లో చైతన్యం పెరగాలన్నారు. ఒకప్పటి పోరాట పటిమ కనిపించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గిరిజన, ఆదివాసీ, ఉపాధ్యాయ సంఘం నాయకులు సవర జగన్నాయకులు, ఎం.డొంబురు, సవర జగన్, సవర గణేశ్వరరావు, ఎం.దండాసి, సవర జయరాం, మార్పు జగన్మోహనరావు, వాయలపల్లి నారాయణరావు, వల్లభ హరికృష్ణ, కోత ధర్మారావు, మామిడి కోదండరావు, ఈశ్వరరావు, నల్ల హడ్డి, బద్రి కూర్మారావు, ధర్మారావు, నీలకంఠం, సవర రామ్మూర్తి, సవర చంద్రమ్మ, శ్రీధర్ పాత్రో, సవర శ్రీరాములు, ఆర్.లక్ష్మణరావు, కె.శ్రీకాంత్, సవర పూర్ణచంద్రరావు, మోణింగి మధుబాబు, సవర నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.70 కోట్లతో గ్రామీణ రహదారి నిర్మాణం

పోత్రియా--కొటరింగ్ తాళభద్ర మార్గానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, సెప్టెంబరు 30 (వార్త): పలాస మండలంలోని పోత్రియా నుంచి కొటరింగ్ తాళభద్ర వరకు రూ.1.70 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న గ్రామీణ రహదారి పనులకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష బుధవారం శంకుస్థాపన చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న ఈ రహదారి నిర్మాణం పూర్తయితే ఆయా గ్రామాల మధ్య రవాణా సౌకర్యం మరింత మెరుగుపడనుంది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో రహదారులు కీలక పాత్ర పోషిస్తాయని ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. రహదారి సౌకర్యం మెరుగుపడటం వల్ల ప్రజలు నిత్యావసర పనుల కోసం సమీప ప్రాంతాలకు సులభంగా చేరుకోవడంతో పాటు విద్యార్థులు విద్యాసంస్థలకు, ప్రజలు వైద్య సేవలకు చేరుకునేందుకు వెసులుబాటు కలుగుతుందన్నారు. ముఖ్యంగా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించేందుకు రవాణా ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. పోత్రియా-కొటరింగ్ తాళభద్ర మార్గం అభివృద్ధి చెందడం వల్ల మార్గమధ్యంలోని గ్రామాలకు అనుసంధానం బలోపేతమవుతుందని, రాకపోకలు పెరగడంతో స్థానికంగా వాణిజ్య, వ్యవసాయ కార్యకలాపాలకు కూడా ఊతం లభిస్తుందని ఆమె వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలకు దీర్ఘకాలం ఉపయోగపడే విధంగా రహదారి నిర్మాణం ఉండాలని స్పష్టం చేశారు. పలాస నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని గౌతు శిరీష తెలిపారు. పోత్రియా నుంచి కొటరింగ్ తాళభద్ర వరకు చేపడుతున్న ఈ రహదారి నిర్మాణం గ్రామీణ అనుసంధానాన్ని మరింత బలోపేతం చేసే మరో ముందడుగుగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ పీరుకట్ల విఠల్, మండల టిడిపి నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు సంధ్యారాణికి ఘన సన్మానం

పలాస, సెప్టెంబరు 30 (వార్త): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ఉత్తమ సేవలందించిన కాశీబుగ్గ సూదికొండ నమూనా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు టి.సంధ్యారాణికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలి పురస్కారం లభించడం అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారి సిహెచ్.శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలి పురస్కారం అందుకున్న సంధ్యారాణిని పురస్కరించుకుని బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, స్థానికులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించడంతో పాటు వారిలో సామాజిక బాధ్యత, సేవాభావాన్ని పెంచేందుకు సంధ్యారాణి చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఉపాధ్యాయ వృత్తిని కేవలం బోధనకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాలతో ముడిపెట్టి సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. మండలానికి చెందిన ఉపాధ్యాయురాలికి జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించడం ఉపాధ్యాయ వర్గానికే కాకుండా మండల ప్రజలకు కూడా గర్వకారణమన్నారు. భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు అందుకుని విద్యారంగంలో మరింత ఉన్నత సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం.ఢిల్లీశ్వరరావు, జోగ తిరుపతి, దాసరి చిన్నారావు, ఉపాధ్యాయులు రేణుక, పద్మకుమారి, హేమలత, ఆశారాణి, పాఠశాల నిర్వహణ కమిటీ అధ్యక్షురాలు బి.పూజ, ఉపాధ్యక్షురాలు ఎం.ఈశ్వరి పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ కుటుంబానికి పరామర్శ

పాతపట్నం, సెప్టెంబర్ 30 (వార్త) : కొరసవాడ గ్రామానికి చెందిన బతకల లక్ష్మీనారాయణకు చెందిన 35 గొర్రెలు ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబం తీవ్రంగా నష్టపోయింది. ఈ విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ బీసీ యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ఇప్పిలి జగదీశ్వరరావు యాదవ్, జిల్లా గొర్రెల సంఘం ఛైర్మన్ కుజ్జ తాతయ్య బాధిత కుటుంబం ఇంటికి వెళ్లి లక్ష్మీనారాయణను పరామర్శించారు. ఘటన వివరాలను అడిగి తెలుసుకుని బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి ఈ ఘటనను తీసుకెళ్లి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా తమ వంతు కృషి చేస్తా మని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యాదవ నాయకులు పల్ల నరహరి, పల్ల వెంకీశ్వరరావు, డొక్కార పురుషోత్తం, కొల్లి బైరాగి, రమేష్, బామ్మిడి లక్ష్మీనారా యణ, స్థానికులు పాల్గొన్నారు.

అంగన్వాడీలతో బాలలు, గర్భిణులకు పౌష్టిక భద్రత

పలాస, సెప్టెంబరు 30 (వార్త): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా కాశీబుగ్గ అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాన్ని బుధవారం పెంటవీధి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. బాలలు, గర్భిణులు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పౌష్టికాహార సేవలు, ఆరోగ్య పరిరక్షణ చర్యలపై కార్యక్రమంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షుడు పాలవలస వైకుంఠరావు మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో కీలకమని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నారులకు వయసుకు అనుగుణంగా అవసరమైన పోషకాలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పిల్లలకు ఇష్టమైన రీతిలో ఆహారాన్ని తయారు చేసి అందిస్తూ కీలక సేవలు చేస్తున్నారని తెలిపారు. సేవా సంకల్ప అభియాన్ సహ కన్వీనర్ రామానంద స్వామీజీ మాట్లాడుతూ గర్భధారణ దశ నుంచే తల్లి, శిశువు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరమన్నారు. గర్భిణులకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారంతో పాటు ఆరోగ్య పరీక్షలు, అవసరమైన వైద్య సేవలు అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. ఆశా కార్యకర్తలు గర్భిణులను ప్రభుత్వ వైద్యశాలలకు తీసుకెళ్లి పరీక్షలు చేయించడం, అవసరమైన మందులు అందేలా చూడటం వంటి సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కె పార్వతి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన పట్టిక ప్రకారం అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. కేంద్రాల్లో ప్రదర్శించే ఆహార పట్టిక ప్రకారం ప్రతిరోజూ నిర్ణీత మెనూ అమలు జరిగేలా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. పౌష్టికాహారంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడటంతో పాటు అంగన్వాడీ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌష్టికాహార సేవలు అందిస్తున్న ఆయాలు, ఆశా కార్యకర్తలను రామానంద స్వామీజీ సౌజన్యంతో చీరలతో సత్కరించారు. చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి హనుమంతు రామారావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు వైశ్య రాజ్‌మోహన్‌రాజ్, జనసేన నాయకులు శంకు శ్రీకాంత్, లైసెట్టి గిరి, తెలుగుదేశం పార్టీ నాయకులు లోడగల కామేశ్వరరావు, బదాడ ఉమాకాంత్, శ్రీనివాసరావు, పాఠశాల కమిటీ చైర్మన్ పాపారావు, హనుమంతు చిలకమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, గర్భిణులు, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546